29-3-57

రానురాను

# ఔపదేశికంగా

టి. వి. శంకరం

ఆర్థిక సౌభాగ్యంతోబాటు నైతిక దృష్టికూడా పెరగటం అవసరం. లేకపోతే, ఆలివర్ గోల్డ్‌స్మిత్ అన్నట్టు—సంపద పెరుగుతుంది, మనుషులు తరుగుతారు. చిన్న ఇల్లున్నచోట పెద్ద భవంతి లేస్తుంది కారు షెడ్డు వెలుస్తుంది గూర్ఖా ఏర్పాటవుతాడు ఈలోపల బుద్ధి గడ్డి తినబోయి మళ్ళీ వెనక్కు తిరిగి రావటం మరిచిపోతుంది.

చూడగా చూడగా ఆర్థిక సౌభాగ్యానికి బుద్ధి గడ్డి తినటానికీ కొంత అవినాభావ సంబంధం ఉన్నట్టు కనిపిస్తుంది

తిండికిలేక మాడేవాడికి అతిగా తినవద్దని బోధించటం నిరుపయోగం వాళ్లను విటమినులూ, ప్రొటీనులూ కొవ్వు పదార్థాలూ ఉండే ఆహారం తినమనటం విప్లవాలకు దారి తీయవచ్చు! (మేరీ ఆంటోయినెట్ ఆత్మకు శాంతి కలుగుగాక!)

దొంగతనాలుచేసి పదిహేనుసార్లు జైలుకు వెళ్ళివచ్చినా పదిరాళ్లు వెనక వెయ్యలేని వాడితో, "నాయనా, నువు ఇంకొకరి సొత్తు అపహరించటం చాలా తప్పు!" అని చెప్పి ఆటే ప్రయోజనంలేదు

తెగతినవద్దని చెప్పదలిస్తే, ఇంత తినగలిగిన స్థితిలో ఉన్నవాళ్ళకే చెప్పాలి. ఇతరుల సొత్తు హరించవద్దని చెప్పదలిస్తే, చట్టానికి గంతలుకట్టి దోపిడీద్వారా లక్షలూ, కోట్లూ గడించేవారికే చెప్పాలి

దరిద్రులూ, నిర్భాగ్యులూ ఉపదేశాలకు అతీతులు "భగవంతుడుకూడా వాళ్ల ఎదట భోజనం రూపంగాతప్ప కనిపించ సాహసించ లేదు," అని గాంధీజీకూడా అన్నాడు

భగవంతుడికి కాస్త బుద్ధి ఉండి ఉండాలి కాని మానవ మాత్రులకు అది లోపించటం వల్ల, వాళ్లు పేదలకి ఉపదేశించటానికి యత్నిస్తారు. ధనికులకు ఉపదేశించటానికి వాళ్లకు "కలేజా" ఉండదు ఉపదేశించి ప్రయోజనం ఉండదు సరికదా, ఉపదేశం మరీ ఉదాత్తమైతే ఔపదేశికుడికి ప్రమాదం, (ఉదా యేసుక్రీస్తు, మహాత్మాగాంధీ, సోక్రాటీస్ మొదలైన వాళ్లు) కాని ప్రాణాలకు లక్ష్యపెట్టక ఉపదేశం చేయబూనుకున్నవాళ్లు దరిద్రులను వదిలేసి ధనికులకే ఉపదేశాలు చేస్తారు అయితే వీళ్లు ఎంత మైనారిటీ అంటే, వీళ్లను పిలిచి గవర్నరు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని అడిగే అవకాశం బొత్తిగాలేదు.

మనం తరుచు చూసే ఔపదేశికులు నిరపాయంగా ఉపదేశాలు చేసేవారు మాత్రమే వారైనా కొత్తకొత్త ఉపదేశాలు చెయ్యరు; గడిచిన అయిదారువేల సంవత్సరాలుగా అందరికీ తెలిసిన ఉపదేశాలే చేస్తారు.

పేదలకు ఉపదేశించటంలాటిదే పిల్లలకు ఉపదేశించటం కూడా పిల్లలకు ఉపదేశించటం నల్లేరుమీద బండినడకే! దరిద్రులకు ఉపదేశించటానికి సాహసం చాలనివాళ్లు నయితం పిల్లలకు ఉపదేశాలు చెయ్యటానికి నిక్షేపంగా ముందుకురావచ్చు ఎందుకంటే, విప్లవాలుచేసిన దరిద్రులున్నారుగాని, విప్లవం చేసిన పిల్లలున్నట్టు చరిత్ర చెప్పటంలేదు—1942 ఆగస్టులో తెనాలి స్టేషను తగలబెట్టిన వాళ్లను మినహాయిస్తే.

అయితే, అడ్డమైనవాళ్లూ వచ్చేసి పిల్లలకు ఉపదేశాలు చేసిపోవటమా అని మనం విచారించవలసిన అవసరంలేదు దేశంలో పిల్లలు ఎప్పటికన్నా ఎక్కువ ఉన్నారు దేశంలో ఐక్యత లోపించి ఉన్నది. (కేరళలో కమ్యూనిస్టులు గెలవటమేమిటి? బొంబాయిలో భాషా

25-3-57



రాష్ట్రవాదులకు అన్ని సీట్లు రావటమేమిటి?) ఒకవంక సినిమాలూ, ఇంకోవంక కమ్యూనిజం, మరోవంక రాజకీయాలూ, నాలుగోవంక క్రమశిక్షణా రహితత్వం అయిదోవంక కులతత్వవాదమూ (ఇది పెద్దలైన రాజకీయవాదుల ప్రత్యేక హక్కు!) ఇత్యాది దుష్టశక్తులు మన దేశపు పిల్లలను నాశనం చెయ్యటానికి పొంచి ఉన్నాయి నిన్నటి పిల్లలైన నేటి నాయకులు కేవలం అదృష్టంవల్ల సరిఅయిన మార్గంలో అభివృద్ధి అయారు కాని రేపటి పౌరులైన పిల్లలు స్వతంత్ర భారతంలో ఏమవుతారో ఎవరూ చెప్పలేరు అందుచేత ఔపదేశికులు అవసరం

ఈ ఆవశ్యకతను మరొక కారణం కూడా సెకండ్ చేస్తోంది ఆదేమిటంటే, పిల్లలకు పనికి వచ్చే సినిమా చిత్రాలలాగే, పిల్లలనీతిని ఆర్ సి (రీ ఇన్ ఫోర్స్డ్ కాంక్రీట్) చేసే రచనలు లోగడ బహు తక్కువ శతకాలువల్లె వేయించేవాళ్లుగాని, వాటిల్లో ''పారకుమీ రణమందున, దూరకుమీ శత్రునింట'' మొదలైన హెచ్చరికలు చూసి, ''ఇవి మనకెందుకా?" అని మేం ఆశ్చర్యపోయేవాళ్ళం అప్పర్ డివిజన్ గుమాస్తాగా రిటైరుకావటం జీవితాశయంగా పెట్టుకున్న కుర్రాడికి రణాలలో పారటం, శత్రులిళ్ళ దూరటం కట్టుకథలు తప్ప మరేమీ కావు అదీగాక, ''కూడకుమీ పరకాంతల'' అనేది ఏమిటో అర్థమయ్యేదికాదు. ప్రహ్లాదుడు 'కన్నుదోయికి అన్యకాంత లడ్డంబైన మాత్ర భావము చేసి మరలువాడు'' (శకటరేఫేత్యాది దోషాలు నావికాని, బమ్మెరపోతన్న గారివి కావు!) అంటే అందులో విశేష మేమిటో తెలిసేది కాదు గౌతముడు తన భార్యని నరకమని పరశురాముడితో ఎందుకన్నాడో తెలిసేది కాదు—కార్త వీర్యార్జునుడు జలకాలాడుతుంటే నిలబడి చూసిందిట, అందులో తప్పేమిటో!

ఇట్లా ఎన్ని ఉదహరణలైనా ఇచ్చుకుంటూ పోవచ్చు అసలు సంగతేమంటే, ఈనాడు ప్రభుత్వాలు పిల్లల సాహిత్యానికి పోటీలుపెట్టి బహుమానాలిస్తున్నాయే, అటువంటి సాహిత్యం వెనక లేదు ఈ పోటీలలో పాల్గొంటే బమ్మెర పోతన్నగారు ఫటా అయిపోతాడు కూడా!

అయితే ఈనాటి బాల ఔపదేశిను' ఎదుర్కొనే సమస్య ఒకటుంది (బాల ఔపదేశికులు షష్ఠీతత్పురుష అవుతుందా, శాస్త్రుల్లుగారూ?) అదేమిటంటే, పిల్లలకు ఏం నీతి నేర్పేట్టు?

కొంచెం ఆలోచిస్తే అది అటే పెద్ద సమస్య కాదు రచనలు కొత్తవి కావచ్చుగాని, ఉపదేశాలు ఎంత పాతవైతే అంత మంచిది. ''మనుషులలో జన్మతహా ఎక్కువ తక్కువలు లేవు'', ''ఇతరుల కాయకష్టంతో కుడిచి కూచోవటం మహా పాపం'' మొదలైన ఆధునిక ఉపదేశాలు వర్జించటం ఎందుకైనా మంచిది ''పెందలకడ నిద్రలేవుము,'' (లేక లేచుము అని ఉండాలా?) 'ఎల్లప్పుడు నిజమునే చెప్పము'', 'కర్మఫలము అనుభవించక తప్పదు'', ''కష్టములను ఓరిమితో సహించవలెను', ''పెద్దలను గౌరవించవలెను'' ఇత్యాది బోధనలు నిరాక్షేపణగా చెయ్యవచ్చు

నా ఉద్దేశంలో వ్యతిరేకార్థకం గల ఉపదేశాలు పనికిరావు. అంటే, నా అభిప్రాయమేమంటే, ''కల్లు తాగవద్దు,'' ''దొంగతనము చేయవద్దు'' మొదలైన ఉపదేశాలు ఆధునిక మనో వైజ్ఞాన సిద్ధాంతరీత్యా అంత మంచివి కావు అటువంటి ఉపదేశాలు చెయ్యటం మూలంగా ఆ పనులు చేయటం అస్వాభావికం కాదేమో అనే అభిప్రాయం కలిగించినట్టవుతుంది ''విషం తాగితే చస్తారు'' అనటంలో అర్థం ఉన్నది ''కల్లు తాగితే ఫలాని రోగం వస్తుంది'', ''దొంగతనం చేస్తే ఫలాని ఎముక విరుగుతుంది'', అని చెప్పటానికి లేదు (కల్లు తాగితే వచ్చే రోగాలను గురించి శాస్త్రవేత్తలకే ఏకాభిప్రాయం లేకుండా ఉంది కొందరు తెగించి, కల్లులో బీ విటమినులున్నాయంటున్నారు కూడా!) తాగేవాళ్ళూ, దొంగతనాలు చేసేవాళ్ళూ శిక్షపడతారని చెప్పవచ్చు కావలిస్తే కాని అందరూ శిక్షపడుతున్నారనటానికి లేదు (నా జేబులోనుంచి డెబ్బై రూపాయలు ఒక్కసారిగా కొట్టేసిన దుర్మార్గుడి పేరు కూడా

నా కింతవరకూ తెలీదు—ఇది జరిగి అప్పుడే నాలుగేళ్ళు దాటింది!)

పిల్లలకు నీతి పుస్తకాలు రాయటంలో ఇంకో సౌలభ్యం ఏమిటంటే, కొత్త పంపిణీలో రాస్తే పాత కథలు కూడా పనికి వస్తాయి ఉదాహరణకు, ఆ పాత కథలో యాయవారం ఎత్తుకునే బ్రహ్మచారి ఇంటివారి కోడలి స్తనాలు చూసి, "అమ్మా, నీ రొమ్ముమీద ఆ వాపు లేమిటి?" అని అడగక్కర్లేదు, వాళ్ళ దొడ్లోవున్న చెట్టు కాయలు చూసి, "అమ్మా, అవేమిటి?" అని అడగవచ్చు. "నాయనా, అవి పుట్టబోయే చెట్లకు బీజా హారాలు!" అని ఇంటినారి కోడలు చెబుతుంది "ఓహో, పుట్టబోయే చెట్లకే బీజా హారాలు ఏర్పాటు చేసినవాడు పుట్టి పెరిగిన నాకు ఆహారం ఏర్పాటు చెయ్యక పోతాడా?" అని బ్రహ్మచారి యాయవారం మానేసి గుళ్ళో పడుకుంటాడు మిగిలిన కథ మామూలే

బాలొపదేశికులు (ఇందాకటి సమాసమే, సంధి కలిపి చూశాను, అంతే!) మరొక పని కూడా చెయ్యవచ్చు (ముష్టిది నేను చెప్పట మేమిటి? కొందరు ప్రాజ్ఞులు చేస్తూనేఉన్నారు) అదేమిటంటే, పాత కథల్లో ఉండిన పాత నీతి మనకు నచ్చకపోతే అదే కథ తీసుకుని మనకు నచ్చిన ఇంకొక నీతి వచ్చేటట్టు చెప్పవచ్చు

ఒక నమూనా

రేణుక కార్తవీర్యుడి జలక్రీడలు చూస్తూ నిలబడలేదు గౌతముడికి ఆవిడమీద కోపమూ రాలేదు తన కొడుకు పితృభక్తి పరీక్షింతామని ఆయన (పేరు గౌతముడా? జమదగ్నా?) "ఒరే, నీ తల్లి మెడ తెగవెయ్యి!" అన్నాడు పరశురాముడు తెగేశాడు గౌతముడు (లేక జమదగ్ని) "భేష్!" అని పరశురాముడి భుజం తట్టి, తన పెళ్ళాన్ని బతికించాడు

ఇంతకన్న కూడా నీతి కథలను తారుమారు చేసెయ్యొచ్చు అందరికీ తెలిసిన కాకి, పాము కథను ఈ విధంగా తిరగ రాయవచ్చు.

"ఒక చెట్టుపై యొక కాకి వుండెను అది చెట్టుపై గూడు కట్టికొని గ్రుడ్లుపెట్టి చుండెను. ఆ చెట్టు తొర్రలో యొక పాము యుండెను. అది కాకి పెట్టిన గ్రుడ్లను మ్రింగిచుండెను. దైవ ప్రేరణ చేత కాకి యొక నక్క యొద్దకు బోయి తన యగచాట్లు చెప్పి కొనెను లీలా మానుష విగ్రహుడు శ్రీమన్నారాయణనుని యనుగ్రహముచే నక్కకు యొక యుపాయము జనించెను అది కాకితో సోదరా, యీ సమీపమున గల రాజుగారి పత్ని అప్పుడప్పుడు జలకమాడును, ఆ సమయము గనిపెట్టి నీవు ఆమె ముద్దుటుంగరంబును తెచ్చి పాము యుండు తొర్రలో బడవేయుము నీకు భగవత్కృపచే మేలు గలుగగలదు యని చెప్పెను. కాకి యట్లే చేసెను రాజభటులు కాకిని తరిమి కొని వచ్చెను ముద్దుటుంగరమును తొర్రలో వేసెను తొర్రను తవ్వెను పాము దొరికెను. భటులు పామును చంపెను భగవంతుని ప్రభావ మద్భుతము గదా!"

మనం ఈ కథే కాదు, ఏ నీతి కథ తీసుకుని అయినా భగవంతుడి మహిమను వ్యక్తం చెయ్యవచ్చు. వడ్రంగి సగం కోసి పోయిన దూలంలో కోతికాలు (అండాలు కావు! ఆ మాట రాసినవాడు తెలియక రాశాడు!) ఇరికించుకుని ఎందుకు చచ్చిపోయింది? భగవత్ప్రేరణవల్ల!

ఈ విధంగా ప్రతిదీ భగవంతుడి పరంగా చూడటం మన ప్రాచీన సంస్కృతికి గాని ఈ నాటి సంస్కృతికి గాని ఎంత మాత్రమూ విరుద్ధంకాదు భారత యుద్ధంలో పంచపాండవులు ఎట్లా గెలిచారు? శ్రీకృష్ణుడి ప్రభావం వల్ల! వాళ్ళ ఏ డక్షౌహిణీల సైన్యమూ ఎందుకు హతమయింది? శ్రీకృష్ణుడి ఇచ్ఛవల్ల! భగవంతుడి ఇచ్ఛాలూ, లీలలూ, ప్రభావాలూ పక్కపక్కనే పరిస్తే మానవ యత్నం నిలబడటానికి సూదిమొన మోపినంత జాగా కూడా దొరకదు!

అందుచేతనేగదా మనం ఏడుకొండలవాడికి "స్వామీ, ఈ డాక్టరుగారు నా రోగం కుదిరిస్తే నీకు అభిషేకాలు చేయిస్తాను!" అని మొక్కుకుంటున్నాం! వీలైతే డాక్టరు కిచ్చేది ఎగనాం పెట్టి, ఏడుకొండలవాడి ముడుపు చెల్లించుకుంటున్నాం కూడా!